# President of India attends bilateral meetings during his visit to Bangladesh

December 15, 2021

# బంగ్లాదేశ్‌లో తన పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్న భారత రాష్ట్రపతి

డిసెంబర్ 15, 2021

**బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టిన భారత రాష్ట్రపతి; ద్వైపాక్షిక సమావేశాలకు హాజరు**

**భారత్ యొక్క 'పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం (నైబర్‌హుడ్ ఫస్ట్)' పాలసీలో బంగ్లాదేశ్‌కు ప్రత్యేక స్థానం: రాష్ట్రపతి కోవింద్**

భారత రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్, ఈ రోజు (డిసెంబర్ 15, 2021) ఉదయం ఢాకాలోని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టారు. ఆయనకు బంగ్లాదేశ్ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ అబ్దుల్ హమీద్ స్వయంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి కోవింద్ 2021 డిసెంబర్ 15 నుంచి 17 వరకు బంగ్లాదేశ్‌లో మూడు రోజుల అధికారిక పర్యటన జరుపుతున్నారు. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి తర్వాత ఒక దేశానికి ఆయన జరుపుతున్న తొలి పర్యటన ఇది.

రాష్ట్రపతికి విమానాశ్రయంలో లాంఛనంగా స్వాగతం పలికి, గౌరవ వందనం చేశారు. ఆ తర్వాత, ఆయన  సవర్‌లో ఉన్న జాతీయ అమరవీరుల స్మారకాన్ని సందర్శించి, బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో అమరులైన వారికి నివాళులు అర్పించారు. తదనంతరం, ఆయన 32 ధన్‌మోండిలో ఉన్న బంగబంధు స్మారక మ్యూజియంను సందర్శించారు, అక్కడ ఆయన బంగ్లాదేశ్ జాతి పిత అయిన బంగబంధు షేక్ ముజీబుర్ రహ్మాన్‌కు నివాళులు అర్పించారు.

మధ్యాహ్నం, బంగ్లాదేశ్ రాజకీయ నాయకత్వం అయిన... అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హమీద్, ప్రధాన మంత్రి షేక్ హసీనా మరియు విదేశాంగ మంత్రి డా. ఏకే అబ్దుల్ మోమెన్‌లను రాష్ట్రపతి కలుసుకున్నారు.

ఈ సమావేశాల్లో, బంగ్లాదేశ్ విమోచనకు 50వ వార్షికోత్సవమైన "ముజీబ్ బోర్షో" చరిత్రాత్మక సందర్భాన్ని, మరియు భారత్-బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలకు 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని

అలాగే ప్రజలను రాష్ట్రపతి అభినందించారు. ఇటీవలి చరిత్రలో బంగ్లాదేశ్ విమోచన యుద్ధం అనేది ఒక స్ఫూర్తిదాయకమైన అధ్యాయమని, దీనిలో భారత్ కూడా పాలుపంచుకోవడం తనకు దక్కిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం భారత్ మరియు బంగ్లాదేశ్ ప్రత్యేకమైన స్నేహాన్ని ప్రారంభించాయని, దీనికి భాష, బంధుత్వం, మతం మరియు సాంస్కృతిక నైతికతతో పాటు పరస్పర గౌరవం అనే ఉమ్మడి అంశాలు దన్నుగా నిలిచాయని ఆయన చెప్పారు.

భారత్ యొక్క 'పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం (నైబర్‌హుడ్ ఫస్ట్)' పాలసీలో బంగ్లాదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తో భారత్‌కు ఉన్న అభివృద్ధి భాగస్వామ్యం అనేది అత్యంత సమగ్రమైన మరియు విస్తృతమైన వాటిలో ఒకటని ఆయన చెప్పారు. అదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన సమస్యలను కూడా పరిష్కరించుకోగలిగే స్థాయిలో మన మధ్య సంబంధం ఎంతో పరిణితి చెందినదని ఆయన పేర్కొన్నారు.

వాణిజ్యం మరియు కనెక్టివిటీ గురించి మాట్లాడుతూ, భారత్-బంగ్లాదేశ్ సంబంధాల్లో కనెక్టివిటీ రూపాలు అనేవి ప్రధానమైన మూల స్తంభంగా నిలుస్తున్నాయని రాష్ట్రపతి చెప్పారు. ఇరు దేశాలు కూడా తమ భౌగోళిక సామీప్యత నుండి చాలా లాభపడతాయన్నారు. భారత్ యొక్క అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో బంగ్గాదేశ్ కూడా ఒకటిగా నిలుస్తుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య మరింత సంస్థాగతమైన ఇంకా నిరంతరాయమైన వాణిజ్యం కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతరిక్షం, అణు సాంకేతికత, రక్షణ, ఔషధాలు మరియు ఇతర అధునాతన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఆయన నొక్కిచెప్పారు. అధికారిక 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం' అనేది ఇరు వైపులా వాణిజ్యానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన చెప్పారు.

కోవిడ్ మహమ్మారి వ్యాప్తి సమయంలో భారత్ మరియు బంగ్లాదేశ్ మధ్య సహకారాన్ని ప్రస్తావిస్తూ, మహమ్మారి సందర్భంగా బంగ్లాదేశ్ నుండి భారత్‌కు అందిన మద్దతు పట్ల రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. భారత్ నుండి వ్యాక్సిన్లను అందుకున్న మొట్టమొదటి దేశాల్లో బంగ్లాదేశ్ కూడా ఉండటం, అలాగే మేడిన్ ఇండియా వ్యాక్సిన్లను అందుకుంటున్న అతిపెద్ద స్వీకర్తగా కూడా ఉండటం తనకు ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు.

బహుళపక్ష వేదికల్లో సహకారం గురించి మాట్లాడుతూ, ప్రధానంగా మరింత సన్నిహిత సహకారం అవసరమైన దక్షిణాసియా గురించిన దానితో సహా భారత్ మరియు బంగ్లాదేశ్‌కు విస్తృతమైన అంశాల అజెండా మరియు ఉమ్మడి ఆందోళనలు ఉన్నాయని రాష్ట్రపతి చెప్పారు.

సాయంత్రం తర్వాత, తన గౌరవార్థం బంగ్లాదేశ్ అధ్యక్షుడు బంగభవన్‌లో ఏర్పాటు చేసిన విందులో రాష్ట్రపతి పాల్గొన్నారు.

రేపు, విక్టరీ డే పరేడ్‌లో రాష్ట్రపతి పాల్గొంటారు అలాగే “ముజీబ్ బోర్షో” వేడుకల ముగింపునకు గుర్తుగా బంగ్లాదేశ్ అధ్యక్షుడు నిర్వహించే విక్టరీ డే ఆతిథ్యానికి కూడా హాజరవుతారు.

**ఢాకా**
**డిసెంబర్ 15, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.